క్లుప్తంగా

క్రీడలతో ఆరోగ్యం
చైర్‌పర్సన్ హేమలతరాజుగౌడ్


తుక్కుగూడలో స్కేటింగ్ పోటీల్లో చిన్నారులు

తుక్కుగూడ: విద్యార్థి దశ నుంచే చిన్నారులు అభిరుచి ఉన్న క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బరిగేల హేమలత రాజుగౌడ్ సూచించారు. ఆదివారం కేఎల్లార్ గిగా సిటీ వెంచర్‌లో రంగారెడ్డి జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కేటింగ్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, నిర్వాహకులు ఎడ్ల శ్రీశైలం యాదవ్, బరిగెల సురేష్, యాదయ్య, శ్రీనివాస్, సత్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం
హాజరుకానున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: మండల కేంద్రంలో ఎంపీడీవో సమావేశం హాల్లో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం చేయనున్నట్లు ఎంఈఓ కస్నా నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

నూతన కార్యవర్గం

మీర్‌పేట: హరితపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంచర్ల జయందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాఘవేంద్ర రావు, సంయుక్త కార్యదర్శిగా ఆర్.శ్రీధర్‌రావు, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: హైదరాబాద్ సైబర్ టవర్స్‌లోని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నివాసంలో తండ్రి పురుషోత్తంరెడ్డి భౌతికకాయంపై కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించి ఓదార్చారు.

డ్రైనేజీ పనుల పరిశీలన


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రాఘవేందర్

కడ్తాల్: తలకొండపల్లి కూడలిలో కొనసాగుతున్న సైడ్ డ్రైన్ డ్రైనేజీ పనులను తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ మూడు నెలల క్రితం సైడ్ డ్రైనేజీ కూలిపోయిందని దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. మూడు నెలలుగా ఈ సమస్యను ఎవరూ పట్టించుకోకపోవడంతో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. దీంతో స్పందించిన అధికారులు పనులు నిర్వహిస్తున్నారన్నారు.

అన్మాస్‌పల్లి కూడలిలో...
అన్మాస్‌పల్లి కూడలిలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా పెద్ద గొయ్యి ఏర్పడిందని, వెంటనే ఈ సమస్యను కూడా అధికారులు పరిష్కరించాలని ఆయన కోరారు.

నూతన మసీదు, కమ్యూనిటీ హాల్ ప్రారంభం


అనాజ్‌పూర్‌లో మసీదు ప్రారంభోత్సవంలో చిలుక మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామంలో స్థానిక మసీదు కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మసీదు, కమ్యూనిటీ భవనాన్ని ఆదివారం గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు ఆయనను పూలమాల వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తానని మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు.

శరన్నవరాత్రికి ఏర్పాట్లు షురూ!


వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం

- ముస్తాబవుతున్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం
- 11 రోజుల పాటు ఉత్సవాలు
- ప్రతిరోజూ అన్నదానం
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు


ఆమనగల్లులో వెలసిన దేవి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అక్టోబర్ 3నుంచి 13వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. జిల్లాలో పేరుగాంచిన ఈ దేవాలయం శరన్నవరాత్రి వేడుకలకు ముస్తాబవుతుంది. దీనికోసం ఏర్పాట్లను శరవేగంగా చేస్తున్నారు. ఆశ్వియుజ శుద్ధ పాడ్యమి గడియలు ప్రవేశించడంతో శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఈ ఉత్సవాలలో భాగంగా అమ్మవారు ప్రతిరోజు ఓ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి ఏటా వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు యజ్ఞం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహిళా భక్తుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, సామూహిక వ్రతాలు చేపట్టనున్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహా, కోశాధికారి డాక్టర్ శ్రీనివాస్‌లు తెలిపారు.

భక్తుల కోసం...



వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, యజ్ఞం, హోమం నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నాం. ప్రతిరోజూ భక్తులకు అన్నదానం నిర్వహిస్తాం. శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.
–వీరబొమ్మ రామ్మోహన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

వివిధ అలంకారాల్లో..
శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు అక్టోబర్ 3న అమ్మవారిని బాలా త్రిపుర సుందరి దేవిగా పూజలు చేయనున్నారు. 4న ధనలక్ష్మి దేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న గాయత్రీదేవి, 7న శాకాంబరిదేవి, 8న లలితాదేవి, 9న సరస్వతిదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దినిదేవి, 12న శ్రీ రాజరాజేశ్వరిదేవి, 13న దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. 13న శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారిని ఊరేగించి నిమజ్జనానికి తరలిస్తారు.

మానవ మనుగడకు మొక్కలు అవసరం

మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: మానవ మనుగడకు మొక్కలు అవసరమని మేయర్ చిగురింత పారిజాత పేర్కొన్నారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 23వ డివిజన్‌లో కాశిబుగ్గ వేంకటేశ్వర దేవాలయంలో మేయర్ చిగురింత పారిజాత, పలువురు కార్పొరేటర్లు, పర్యటించారు. ముందుగా దైవ దర్శనం చేసుకొని ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. రాబోవు దసరా పండుగను దృష్టిలో పెట్టుకుని బతుకమ్మ ఏర్పట్ల కోసం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాళ్లగూడం సంతోషి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, గట్టు బాలకృష్ణ, నయనాచారి, కుమార్, కందికంటి నవీన్‌గౌడ్, సూర్ణగంటి విజయ్, ఆలయ ప్రధాన అర్చకులు మధుమోహనాచార్యులు, రవి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న మేయర్ పారిజాత, కార్పొరేటర్లు తదితరులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం
మహారాష్ట్ర ఎమ్మెల్యే అభిమన్యు పవార్

పహాడీషరీఫ్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని మహారాష్ట్ర ఎమ్మెల్యే అభిమన్యు పవార్ పేర్కొన్నారు. మహారాష్ట్రలో నవంబర్‌లో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్కడి అభ్యర్థులు తెలంగాణలో నివాసం ఉంటున్న మరాఠ ఓటర్లపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా ఔసా నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి అభిమన్యు పవార్ ఆదివారం జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీకి విచ్చేసి ఓటర్లను కూడగట్టి వారితో మాట్లాడారు. ఇప్పటికే రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనను మూడో సారి గెలిపించి మంత్రివర్గంలో స్థానం దక్కేలా ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే అభిమన్యుతో బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కూడా ఉన్నారు.


మహారాష్ట్ర ఎమ్మెల్యే అభిమన్యు పవార్, అందెల శ్రీరాములు యాదవ్‌ను సన్మానిస్తున్న మరాఠ ఓటర్లు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


సంబురాల్లో నిర్వాహకులు, బాలాపూర్ సీఐ భూపతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలో బాలాపూర్‌లోని బద్దం బాల్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ బిజినెస్ స్కూల్లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కాలేజీ ఫౌండర్ బద్దం భూపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించారు. దీనికి బాలాపూర్ సీఐ తోట భూపతి, కళాశాల కార్యదర్శి బి జైపాల్‌రెడ్డి, డైరెక్టర్, ప్రిన్సిపాల్, బి.సునీతభూపాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతోనే భవిష్యత్ వెతుక్కోవాలని సూచించారు. చదువును నమ్ముకున్నవారు ఎక్కడా కూడా ఓటమి చూడలేదన్నారు. తల్లిదండ్రుల ఆశలు నిజం చేయాలన్నారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, ప్రొ. జె.మాధవి, పి.సంతోష్, బి. సత్యనారాయణ, స్వాతి, శరణ్య, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్స్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం గ్రామస్తులకు యోగాపై పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురువు భాగ్యనగర్ దక్షిణ జిల్లా సీనియర్ యోగ ప్రచారకుడు సత్తయ్య పాల్గొని ప్రజలకు యోగాసనాలు వేయించారు. యోగ చేయడంతో బీపీ, షుగర్ వ్యాధులను తగ్గించుకోవచ్చని ఆయన సూచించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగ సాధన చేసి ఆరోగ్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్య, మాజీ ఎంపీటీసీ రాజు, యాదయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి సన్మానం

షాద్‌నగర్: జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ను ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించారు. షాద్‌నగర్‌కు విచ్చేసిన మాజీ ఎంపీ పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్‌ను ఆయన పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరు బస్వం, ఈశ్వర్ రాజు, ఇబ్రహీం, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి అభిషేకం

చేవెళ్ల: మండల పరిధిలోని కమ్మెటలో ఆదివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జంగయ్య, మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, వెంకటయ్య, భిక్షపతి, అంజయ్య, బాలకృష్ణ, వెంకటేశ్, పెంటయ్య, నర్సింలు, రామకృష్ణ, ఆంజనేయులు, రాములు, సత్యనారాయణ, జంగయ్య, కుమార్, పాండు, మణికాంత్, మనోహర్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

చేవెళ్ల: వారంతా ఇరవై ఐదు ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు. అందరూ మళ్లీ ఒకచోట చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మండల పరిధిలోని చన్వెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండలంలోని ఓ ఫాంహౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరూ యోగక్షేమాలను తెలుసుకుని జీవన స్థితిగతులను పంచుకున్నారు. పాఠశాల రోజులను గుర్తుచేసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రాంప్రసాద్, విజయ్‌కుమార్, బల్వంత్‌రెడ్డి, అనంతం, బుచ్చిరెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, విద్యార్థులు భూపాల్, యాదయ్య, నర్సింలు, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్, రవికుమార్, మల్లికార్జున్, తిరుపతిరెడ్డి, సరిత, రాధిక, వనిత, మమత, పద్మ, అరుంధ, అరుణ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల: మండల పరిధిలోని పామెన గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీరభద్రస్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. దేవుని ఎర్రవల్లికి చెందిన సామ రంగారెడ్డి 50 బస్తాల సిమెంటు, పామెనకు చెందిన దావల్‌గారి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి 100 బస్తాల సిమెంటు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, ఎర్ర గోపాల్, కొయ్యాడ రాములు, కంకంటి యాద య్య, సత్యశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్

తలకొండపల్లి: మాలీలు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, కాటన్ మిల్లులు, రైస్ మిల్లులు, ఎస్సీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో పని చేసే అసంఘటిత కార్మికులకు నెలకు రూ. 26,000ల వేతనాన్ని ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం కలెక్టర్ శశాంకకు చంద్రమోహన్‌తో పాటు, ఐసీటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఎస్సీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని విన్నవించారు. హమాలి కార్మికులకు ఇన్సూరెన్స్ గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని కోరారు.


కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రుద్ర కుమార్, శ్రామిక మహిళా కన్వీనర్ కవిత, ఆమనగల్ ఏరియా కన్వీనర్ జిల్లెల పెంటయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ, సుజాత తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 21వ వార్డులో రూ.16లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి ఆదివారం కౌన్సిలర్ ఓరుగంటి సుజాత కిషన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. దీంతో పాటు బృందావన్‌నగర్ కాలనీల్లోని రెండు పార్కు స్థలాలకు ప్రహరీ నిర్మాణంతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పలు కాలనీల్లో లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేసారం బాల్‌రెడ్డి, ఓరుగంటి కొండల్‌గౌడ్, జోర్క శ్రీరాములు, శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సయ్యద్, శంకర్‌యాదవ్, లక్ష్మీనగర్, బృందావన్‌నగర్ కాలనీల అధ్యక్షుడు జగన్‌ప్రసాద్, సంజీవరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవాలి

రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్

కడ్తాల్: ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవాలని రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలో వివిధ అనారోగ్య సమస్యలతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. కడ్తాల్‌కు చెందిన సిలివేరు జంగమ్మ, సాలార్‌పూర్‌కు చెందిన కావలి చెన్నమ్మ, కర్రె శివమ్మ, సాయిలు, వంపుగూడకు చెందిన బీమయ్య, కిష్టయ్యల కుటుంబ సభ్యులను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి దశరథ్‌నాయక్ పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపీటీసీ ప్రియా రమేశ్, మాజీ సర్పంచ్‌లు హరిచంద్, కృష్ణయ్య, బీఆర్ఎస్ కడ్తాల్ పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, నర్సింహ, పంతునాయక్, బాబా, చందు, వెంకటేశ్, జైపాల్, గోపాల్, నరేశ్, ప్రకాశ్, కృష్ణయ్య, మాధవులు, తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న దశరథ్‌నాయక్

గౌడ సంఘం అధ్యక్షుడిగా బాలయ్యగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్ గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా గడ్డం బాలయ్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం ఆవరణలో నిర్వహించిన గౌడ సంఘం సమావేశంలో ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శిగా నారం వెంకటేష్‌గౌడ్, డైరెక్టర్లుగా బొడిగె రవీందర్‌గౌడ్, చెరుకు భాస్కర్‌గౌడ్, తొర్పునూరి యాదయ్యగౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, అంతటి మహేశ్ గౌడ్‌లను ఎన్నుకున్నట్లు గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు. అంతకుముందు నిర్వహించిన సమావేశంలో పలువురు సంఘం ప్రతినిధులు మాట్లాడారు. గ్రామంలోని గౌడ కులస్థులందరూ ఐక్యంగా ఉండాలని, కులస్థులకు ఎదురయ్యే సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచులు బొడిగె అశోక్‌గౌడ్, చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ చెరుకు వెంకటేష్‌గౌడ్, మాజీ సంఘం అధ్యక్షుడు బొడిగె జగదీశ్వర్‌గౌడ్, బుర్ర బాలయ్యగౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు బుర్ర చంద్రంగౌడ్, తొర్పునూరి ధనుంజయ్యగౌడ్, బొడిగె రాజేష్‌గౌడ్, బుర్ర మహేందర్‌గౌడ్, చెరుకు రాంగోపాల్‌గౌడ్, మందుగుల శ్రీశైలంగౌడ్, నారం బాబుగౌడ్, బొడిగె గోవర్ధన్‌గౌడ్, తొర్పునూరి ప్రవీణ్‌కుమార్‌గౌడ్‌లతో పాటు గౌడ పెద్దలు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న గౌడ సంఘం పెద్దలు

బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని వినతి


ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో జంగారెడ్డి తదితరులు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని మాల్ గ్రామస్తులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం మాల్ మాజీ సర్పంచ్ లిక్కి జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ యాదవ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. మాల్ కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ విలువైందని, రూ.40లక్షలతో బస్టాండ్ ఆవరణలో వ్యాపార సముదాయాలను నిర్మించినట్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్టాండ్‌లో బస్సుల రాకపోకలు సాగించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహా, నల్లవెల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.

ప్రజల చూపు బీజేపీ వైపు

- సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టండి
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

యాచారం: తెలంగాణ రాష్ట్ర ప్రజల చూపు బీజేపీ వైపే ఉందని, సభ్యత్వ నమోదుకు దృష్టి పెట్టాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పార్టీ శ్రేణులకు సూచించారు. నల్గొండ జిల్లా మండలంలోని నెలవాలపల్లిలో పార్టీ కార్యకర్త తండ్రి మృతి చెందిన సందర్భంగా ఆయనను పరామర్శించారు. అనంతరం శనివారం రాత్రి హైదరాబాద్‌కు తిరు ప్రయాణంలో యాచారం మండల కేంద్రంలోని బీజేపీ దళిత మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా కొప్పు భాషా ఇంట్లో కొద్ది సేపు కార్యకర్తలతో ముచ్చటించారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీనే అధికారంలోకి రాబోతుందని జోస్యం చెప్పారు. పార్టీ సభ్యత్వ నమోదుకు దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య, బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, గుడాల వెంకటేష్, మాదం జంగయ్య, శ్రీనువాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


యాచారంలో పార్టీ నేతలతో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


1998-99 పదోతరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–1999 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాల అనంతరం సిల్వర్ జూబ్లీ వేడుకల పేరుతో అందరు ఒక్క చోట చేరారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆనాటి పాత జ్ఞాపకాలను స్మరించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు కొప్పు జంగయ్య, కే. శ్రీనివాసులు, పాగాకు సురేష్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం ఈ సమ్మేళనానికి విశిష్ట అతిథిగా వచ్చిన స్థానిక ఏసీపీ కేపీవీ రాజు మాట్లాడారు.